క్లుప్తంగా

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ



పెదకాకాని: రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు పాటు పడిన మహనీయుడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు అన్నారు. పెదకాకాని మండలంలోని అగతవరప్పాడు ఏవీఎస్‌కాలనీ ప్రాథమిక పాఠశాలలో సోమవారం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 74వ జయంతి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా అగతవరపాడు మాజీ సర్పంచ్ చిన్న పోలిరెడ్డి సహకారంతో స్కూల్ పిల్లలకు 50 భోజనం ప్లేట్లు కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో అందించారు. అనంతరం విద్యార్థులకు చాక్లెట్‌లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే , జిల్లా అధ్యక్షులు లింగం శెట్టి ఈశ్వరరావు. పొన్నూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి జక్కా శ్రీనివాస్. మండల కాంగ్రెస్ అధ్యక్షులు కంతేటి యలమందరావు. స్థానిక నాయకులు నాగరాజు. మనోజ్ కుమార్. కోటేశ్వరరావు. కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని నిర్వహించారు.

పేకాట స్థావరంపై దాడి

గుంటూరు రూరల్: పేకాట స్థావరంపై దాడి చేసి జూదరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు మల్లవరం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడిచేసి ఐదుగురు వ్యక్తులతోపాటు, వారి నుంచి రూ. 2వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

కోడిపందేల స్థావరాలపై దాడి

గుంటూరు రూరల్: నగర శివారులో కోడిపందేలు ఆడుతున్న స్థావరంపై దాడిచేసి కోడిపందేల నిర్వాహకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం బుడంపాడు గ్రామంలో కోడిపందేలు ఆడుతున్నారన్న సమాచారం మేరకు సోమవారం దాడి చేసి ఐదుగురు వ్యక్తులు, కోడిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరచనున్నట్లు తెలిపారు.

గుంటూరు చానల్ పొడిగించాలని రాస్తారోకో

పెదనందిపాడు: గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొడిగించాలని, గుంటూరు చానల్ పర్చూరు వరకు పొగిడించడానికి నిధులు కేటాయించాలని కోరుతూ టీడీపీ నాయకులు, రైతులు రాస్తారోకో చేశారు. సోమవారం ఉదయం పెదనందిపాడు పాత బస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతానికి సాగు తాగు నీరందించె గుంటూరు చానల్‌ను పొడిగించాలని దాని వల్ల ఈ ప్రాంతానికి చాలా ఉపయోగాలు ఉన్నాయని వారు చెప్పారు. తదనంతరం ఎస్ అబ్దుల్ రెహమాన్ తన సిబ్బందితో అక్కడకు వెళ్లి వారికి సర్దిచెప్పి ధర్నాను విరమింప చేశారు.

ఆటోనగర్‌లో వ్యక్తి అనుమానాస్పద మృతి

పెదకాకాని: గుంటూరు ఆటోనగర్‌లో వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. ఆటోనగర్ వంద అడుగుల రోడ్డు చాయ్‌హబ్ ఎదురుగా ఉన్న కాళీ ప్రదేశంలో మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ముందస్తు సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి దర్యాప్తు చేపట్టారు. మృతుని శరీరంపై డ్రాయర్, బనియన్ మాత్రమే ఉన్నాయి. సుమారు 40 సంవత్సరాల వయస్సు కలిగిన మృతిని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. మహారాష్ట్ర ప్రాంతం నుంచి వ్యక్తి గత కొంతకాలంగా ఆటోనగర్‌లో పనులు చేసుకునేందుకు వచ్చాడని స్థానికులు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తి ఆనారోగ్యంతో చనిపోయాడా ఎవరైనా కొట్టి చంపారా అని ఆరా తీస్తున్నారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

సుద్దపల్లిలో పల్సర్ బైక్ దగ్ధంపై కేసు నమోదు

చేబ్రోలు: మసీదు ముందు ఉంచిన పల్సర్ బైక్ దగ్ధం కావడంపై చేబ్రోలు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. చేబ్రోలు గ్రామానికి చెందిన మహబూబ్ సుభాని సుద్దపల్లి గ్రామంలోని మసీదులో మూడు రోజుల నిద్ర చేయడానికి అక్కడకు వెళ్లాడు. ఆదివారం రాత్రి పది గంటల సమయంలో మసీదు ముందు పల్సర్ బైక్‌ను నిలిపి మసీదులో నిద్రిస్తున్నాడు.

సోమవారం తెల్లవారు జామును సుమారు రెండు గంటల సమయంలో బైక్ దగ్ధమవుతున్నట్లు చుట్టుపక్కల స్థానికులు తెలియజేయడంతో వెళ్లి చూసే సరికి బైక్ పూర్తిగా దగ్ధమైంది. జరిగిన ఘటనపై బాధితుడు సుబాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ కె ఆనంద్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకృతి కనికరించకపోయినా.. చీడపీడల బెడదతో పంట దిగుబడి తగ్గినా భూ యజమానితో చేసుకున్న ఒప్పందంతో ప్రతి ఏటా కౌలు రైతులు డబ్బులు చెల్లిస్తుంటారు. కౌలు రైతులకు వ్యవసాయం తప్ప మరే పని తెలియకపోవడంతో ఎన్ని ఇబ్బందులు ఉన్నా పంటల సాగు చేయడానికే మొగ్గు చూపుతారు. ఏటా దిగుబడి వస్తుందనే ఆశాబావంతో భూమి తల్లినే నమ్ముకుని సేద్యం చేస్తుంటారు. ఇలా వ్యవసాయమే ఆధారంగా బతుకున్న కౌలు రైతులకు ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారిని ఆదుకోవడానికి సంకల్పించారు. సాగు చేస్తున్న కౌలు రైతులకు పంట సాగుదారుల హక్కుల పత్రం (సీసీఆర్‌సీ కార్డులు) ఇచ్చి మద్దతుగా నిలుస్తున్నారు. దీంతో కౌలు రైతుల సైతం భూ యజమానులతో సమానంగా ప్రభుత్వం నుంచి లబ్ధి పొందే అవకాశం ఉంది. కౌలు రైతులకు లబ్ధి కలిగేలా.. అదే సమయంలో భూ యజమానికి ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలూ చేపట్టింది. కౌలు రైతులకు సాగు హక్కు పత్రం మంజూరు చేయటం ద్వారా వారికి రుణ సదుపాయం పొందే వీలు కల్పించింది. తద్వారా పంట సాగుకు పెట్టుబడికి ఎవరిపై ఆదారపడకుండా రైతులు ధీమాగా ఉండాలని ప్రభుత్వం బావించింది.



చేబ్రోలు రైతు భరోసా కేంద్రం

కౌలు రైతుకు భరోసా...

- పంట సాగుదారులకు హక్కు పత్రం
- భూ యజమానికి నష్టం లేకుండా చర్యలు
- అర్హులందరికీ సీసీఆర్సీ కార్డులు

చేబ్రోలు: రైతుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో భరోసా కల్పిస్తోంది. సాగుదారులకు పంట సాగు హక్కు పత్రాన్ని అందజేసేందుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు జగనన్న సురక్ష కార్యక్రమంలో స్పెషల్ డ్రైవ్ ద్వారా జులై 31 వరకు గ్రామాల్లో వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఏపీ పంట సాగుదారుల చట్టం 2019పై అవగాహన కలిస్తూ, సాగు చేసే కౌలు రైతుకు పంట సాగు కార్డు అందించే విధి విధానాలను ఈ సదస్సులో వివరిస్తున్నారు. వ్యవసాయాధికారులు గ్రామ గ్రామాన నిర్వహించే సదస్సులలో అర్హులకు పంట సాగు దారు హక్కు పత్రమును వెంటనే అందజేస్తున్నారు. కౌలు రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి వారిని అన్ని విధాల ఆదుకోవాలని ప్రభుత్వం లక్ష్యంగా చేసింది. పొన్నూరు నియోజకవర్గంలోని చేబ్రోలు, పొన్నూరు, పెదకాకాని మండలాల్లో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. ఎక్కువ శాతం మంది రైతులు వెద పద్ధతిలో వరి సాగు చేపడుతున్నారు. చేబ్రోలు మండలంలో సుమారు 16వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. గత ఏడాది 2194మందికి సీసీఆర్సీ కార్డులు అందించాలని లక్ష్యం కాగా 3200 మందికి కార్డులను అందజేశారు. ఈ ఏడాది 2194మంది కౌలు దారులకు కార్డులు అందించాలని లక్ష్యం కాగా ఇప్పటి వరకు 1461మందికి సీసీఆర్సీ కార్డులు అందజేశారు. ఈ నెలాఖరుకు లక్ష్యంను పూర్తి చేసే పనిలో వ్యవసాయ, రెవెన్యూశాఖ అధికారులు, సిబ్బంది నిమగ్నమయ్యారు.

కౌలు రైతులకు ప్రభుత్వం చేయూత...

వ్యవసాయంలో కష్టనష్టాలు భరిస్తున్న కౌలు రైతుకు



దుక్కులు దున్నుతున్న రైతులు

చేయూతనిందించాలి. అదే సమయంలో భూ యజమాని హక్కులకు ఎటువంటి విఘాతం కలగకుండా ప్రభుత్వం చట్టం చేసింది. సాగు దారులకు పంట సాగుదారు హక్కు పత్రం ఇచ్చేందుకు గాను ప్రభుత్వం పంట సాగుదారు హక్కు చట్టం-2019ని అమలులోకి తీసుకువచ్చింది. 2019 అక్టోబర్ నుంచి పంట సాగుదారుల హక్కు పత్రాల పంపిణీ జరుగుతున్నది. సాగుదారు పత్రాలు పొందిన కౌలు రైతులకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పించటానికి వ్యవసాయశాఖ, రెవెన్యూశాఖ గ్రామాల్లో బ్యాంకు అధికారులతో రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకొని అర్హత గల సాగుదారులకు పంట సాగుదారు హక్కుల పత్రాలను మంజూరు చేయటంతో పాటు వాటి ద్వారా సంస్థాగత రుణాలను బ్యాంకుల ద్వారా పొందటానికి వీలు ఉంటుంది.

కౌలు రైతులకు అర్హతలు...

సాగుదారు హక్కు పత్రం కాలపరిమితి మూడు నుంచి 11 నెలల వరకు ఉంటుంది. దేవాదాయ భూములను సాగు చేసే రైతులకు కూడా ఈ పత్రాన్ని పొందేందుకు అర్హులు. ఈ పత్రంపై భూ యజమాని, సాగుదారు, వీఆర్వో సంతకం చేస్తే సరిపోతుంది. ఈ పత్రం ఇద్దరి దగ్గర ఉంటుంది.



కౌలు రైతు పంట సాగు హక్కు పత్రం

భూ యజమాని సాగుదారుహక్కు పత్రంపైనా సంతకం పెట్టడం వల్ల భూ యజమానికి ఎటువంటి నష్టం వాటిల్లదు. గతంలో ఉన్న ఏపీ కౌలుదారుల చట్టం 1956ను రద్దు చేశారు. దరఖాస్తు చేసుకొన్న మూడు రోజులలో సాగుదారులకు సీసీఆర్సీ కార్డు అందుతుంది.

సీసీఆర్సీ కార్డు వల్ల కలిగే ప్రయోజనాలు...

సాగు దారు హక్కు పత్రంపై బ్యాంకుల నుంచి రూ.1.60 లక్షల వరకు ఎలాంటి పూచీకత్తు లేకుండా రుణం పొందే అవకాశం ఉంది. పంట రుణం పూర్తి బాధ్యత సాగుదారునిపైనే ఉంటుంది. ఈ పత్రం ద్వారా పంట నష్ట పరిహారం, బీమా, సున్నా వడ్డీ కనీస మద్దతు ధర చెల్లిస్తూ ప్రభుత్వం తీసుకునే దిగుబడి, కొనుగోలుకు ఉపయోగపడుతుంది. పంట నమోదు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు పంట నష్టపరిహారం పొందటానికి, వ్యవసాయశాఖ ద్వారా అందించే నాణ్యమైన పచ్చిరొట్ట విత్తనాలు వివిధ పంటల విత్తనాలను రాయితీపై పొందవచ్చు. కౌలు రైతులకు పెట్టుబడి సాయం పొందేందుకు అమలు చేస్తున్న రైతు భరోసా పథకానికి అర్హత పొందవచ్చు.

కార్డులు ఇలా పొందాలి...

- గ్రామ వలంటీర్‌కు భూమి సాగు చేస్తున్న విషయాన్ని కౌలు రైతులు ముందుగా తెలియజేయాలి.
- ఆ వలంటీర్ ద్వారా పంచాయితీ సచివాలంలోని వీఆర్వోను సంప్రదించి కార్డులు పొందవచ్చు.
- దరఖాస్తు ప్రక్రియ చాలా సులభం. కార్డుపై భూయజమాని లేదా ప్రతినిధి సాగుదారు, వీఆర్వో సంతకాలు చేస్తే సరిపోతుంది.
- రైతులు ఖరీఫ్, రబీ సీజన్‌లలో ఎప్పుడైనా కార్డులు పొందవచ్చు.
- దరఖాస్తు చేసుకున్న రోజుల వ్యవధిలోనే కార్డు వస్తుంది.
- కార్డు పొందటంలో ఇబ్బందులు ఉంటే తహసీల్దార్ కార్యాలయంను సంప్రదించాలి.

అవగాహన కల్పిస్తున్నాం...



భూ యజమానులకు, కౌలు రైతులకు గ్రామాల్లోని వ్యవసాయ సహాయకుల ద్వారా, రెవెన్యూ అధికారుల అవగాహన కల్పిస్తున్నారు. కౌలు రైతులకు ప్రభుత్వం 2019 చట్ట ప్రకారం పంట రుణాలను అందించేందుకు 11 నెలల కాలపరిమితి కలిగే కార్డులను ప్రభుత్వం అందజేస్తుంది. భూ యజమానులకు ఎటువంటి నష్టం ఉండదు. కౌలు రైతులకు భూ యజమానులు సహకరించాలి. మండల పరిధిలోని గ్రామాల్లో వ్యవసాయ, రెవెన్యూ శాఖ సిబ్బంది సీసీఆర్సీ కార్డులను అందిస్తున్నారు. ఇప్పటి వరకు 1461 మందికి అందించడం జరిగింది.

– బి.శ్రీనివాస నాయక్, మండల వ్యవసాయశాఖాధికారిణి, చేబ్రోలు.

హోంగార్డు కుటుంబానికి చెక్కు పంపిణీ



నగరంపాలెం: మహిళా హోంగార్డు డి.రమణ గత నెలలో బ్రెయిన్ స్ట్రోక్‌తో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఫ్లాగ్ ఫండ్ రూ.10 వేల చెక్కుని ఆమె కుమార్తె సీహెచ్.దుర్గకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ అందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.సుప్రజ (పరిపాలన) పాల్గొన్నారు.

గంజాయి రహిత గుంటూరు జిల్లాకు కృషి

నగరంపాలెం: గంజాయి రహిత గుంటూరు జిల్లాకు కృషి చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ కె. ఆరిఫ్ హఫీజ్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి సరఫరా, విక్రయాలు చేసే వారితో పాటు సరఫరా చేసే వారిపై కూడా కేసులు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. ఇటీవల తెనాలి, నర్సీపట్నం, ఏలూరు తదితర చోట్ల పలువురిని అరెస్ట్ చేశామని వెల్లడించారు. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉందని స్పష్టం చేశారు. ఒక స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్ మరో ప్రాంతానికి వెళ్తే, వెంటనే అతని వివరాల్ని ఆ పోలీస్‌స్టేషన్‌కు అందిస్తున్నామని తెలిపారు. హత్య కేసులు, గంజాయి, ఇతరత్రా కేసుల్లో నేరస్తులపై ప్రత్యేక నిఘాతో పాటు కౌన్సెలింగ్ కూడా ఉంటుందని చెప్పారు. గుంటూరు కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన బంగారం చోరీ కేసులో ఆధారాలు లభ్యమైనట్లు తెలిపారు.

మెప్మా ఆర్పీ మోసంపై ఫిర్యాదు

నెహ్రూనగర్: మెప్మాలో రిసోర్స్ పర్సన్‌గా(ఆర్పీగా) పని చేస్తున్న డి. పద్మ తమను మోసం చేసిదంటూ సోమవారం ఐపీడీ కాలనీకి చెందిన శ్రావణి గ్రూపు సభ్యులు కలెక్టర్ స్పందనలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. తమ గ్రూపు పేరు మీద మనిషికి రూ.లక్ష చొప్పున ఆర్పీ రూ.10లక్షల లోన్ మంజూరు చేయించిదన్నారు. రూ.30వేలు మాత్రమే తీసుకోవాలని, మిగిలిన రూ. 70వేలు తాను తీసుకుని ప్రతి నెలా బ్యాంకుకు చెల్లిస్తానని చెప్పి రూ.7లక్షలు తీసుకుందని ఆరోపించారు. ప్రతి నెలా తాము డబ్బులు చెల్లించినప్పటికీ వాటిని బ్యాంకుకు కట్టకుండా మోసం చేసిందని తెలిపారు. దీనిపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయగా, మెప్మా అధికారుల్ని కలవాలని అక్కడ అధికారులు చెప్పారన్నారు. కూలీ నాలీ చేసుకుని జీవించే తమకు రూ.70వేలు తాలుకా సంబంధించి నగదు జమ చేయాలని బ్యాంకర్లు ఒత్తిడి చేస్తున్నారని, దీనిపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రూపు లీడర్ ఎస్‌కే అఖిల కోరారు.

పవన్ కళ్యాణ్ వలంటీర్లకు బహిరంగ క్షమాపణ చెప్పాలి



వెంగళాయపాలెం గ్రామ సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న వలంటీర్లు

గుంటూరు రూరల్: ప్రజలకు ప్రభుత్వం అందించే పథకాలు పేదవాడి ఇంటి గుమ్మం దాకా చేరడానికి గ్రామ వలంటీర్ వ్యవస్థను సృష్టించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, వలంటీర్లుకు పవన్ కళ్యాణ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని రూరల్ మండలం జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు డిమాండ్ చేశారు. సోమవారం చిన్నపలకలూరు గ్రామంలో ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ స్వచ్ఛందంగా ప్రజా సంక్షేమానికి సచివాలయ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు వారి కుటుంబం మొత్తానికి ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు అందిస్తున్న స్వచ్ఛంద సేవకులు వలంటీర్లు అని తెలిపారు. ఒకటోతేదీన తెల్లవారు ఝామునే అవ్వ, తాతలకు, వికలాంగులకు, వితంతులకు, ఒంటరి మహిళలకు, ఇంటికి వచ్చి పింఛన్ అందజేస్తున్న గ్రామ వలంటీర్లపై పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. తక్షణమే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ వలంటీర్లకు పవన్ కళ్యాణ్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. పవన్ క్షమాపణలు చెప్పకుంటే ప్రజలు పవన్‌కు బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో వలంటీర్లు తదితరులున్నారు.

కాకుమాను: ఎండనకా, వాననకా, రేయింబవళ్లు ప్రజలకు సేవలు చేస్తున్న గ్రామ వలంటీర్‌ల పట్ల జనసేన అధినేత అనుచిత వాఖ్యలు చేయడం అతని దిగజారుడు రాజకీయాలకు నిదర్శమని గ్రామ వలంటీర్‌ల సంఘ సభ్యులు అన్నారు. గ్రామ వలంటీర్‌లపై అనుచిత వాఖ్యలు చేసిన పవన్ కళ్యాణ్ తగిన చర్యలు తీసుకోవాలంటు సోమవారం సాయంత్రం మండల కేంద్రం కాకుమాను వలంటీర్‌ల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టి ఎంతో మంది నిరుద్యోలకు చిరు ఉద్యోగాలు కల్పించి వారి కటుంబాలను ఆదుకుంటున్నారని వారు తెలిపారు. గ్రామ వలంటీర్ వ్యవస్థల వల్ల గ్రామాల్లో ఏ ఒక్కరు ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరగాల్సిన అవసరం లేకుండా పోయిందని ఈ విషయాన్ని పవన్ కళ్లు, మనస్సు తెరచి చూడాలని వారు సూచించారు. ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును, ఆయా పథకాలను సకాలంలో ప్రజలకు అందింస్తున్న వలంటీర్ వ్యవస్థను చూడలేక పవన్ ఇలాంటి దిగజారుడు పదజాలాలను వాడుతున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. వలంటీర్‌ల వ్యవస్థ అంటే, వారు చేసే సేవల గురించి తెలియకుండా ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే సహించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైన నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడం నేర్చుకుని చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని హెచ్చరించారు. అనంతరం పవన్‌పై స్థానికి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ పంగులూరి శ్రీనివాసరావు, గ్రామ వలంటీర్‌లు ఉన్నారు.

ప్రత్తిపాడు: పవన్ కల్యాణ్ నోటిని అదుపులో పెట్టుకుని మాట్లాడాలని సచివాలయాల మండల కన్వీనర్ వేలూరి లక్ష్మారెడ్డి అన్నారు. వలంటీర్లను ఉద్దేశించి పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఎలాంటి వ్యక్తిగత లాభాపేక్ష లేకుండా స్వచ్ఛందంగా ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ఇంటింటికీ సంక్షేమ పథకాలు చేరవేస్తున్న వలంటీర్ల పట్ల పవన్ చేసి వ్యాఖ్యలు సిగ్గు చేటన్నారు. ఎవరో ఇచ్చిన స్టేట్‌మెంట్లు చదవడం మానుకుని, ప్రజాక్షేత్రంలో ఏమి జరుగుతుందో తెలుసుకోవలసిన కనీస అసవరం పవన్‌కు ఉందన్నారు. అలాకాకుండా నోటికి ఏది వస్తే అది మాట్లాడితే ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ఇలా అసత్యాలు వలెల్వేయడం వలనే 2019 ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పారని, ఇదే విధంగా మాట్లాడుతూ పోతే రానున్న ఎన్నికల్లోనూ అదే గతి పడుతుందని లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.

గుంటూరు రూరల్: పవన్ కళ్యాణ్ వలంటీర్లుపై చేసిన వ్యాఖ్యలపై మండలంలోని వలంటీర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని వెంగళాయపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో మండల వైఎస్ ఎంపీపీ ఇంటూరి పద్మావతి అంజిరెడ్డి మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఒక సంఘ విద్రోహక శక్తిగా తయారయ్యాడన్నారు. కుల మతాలను అడ్డుపెట్టుకుని సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యాఖ్యలు చేస్తున్నాడన్నారు. పవన్ కళ్యాణ్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వలంటీర్లు గత నాలుగేళ్ళుగా చేపట్టిన సేవా కార్యక్రమాలు ప్రజలకు తెలుసని చెప్పారు. కరోనా వంటి క్లిష్ట సమయంలో ప్రజలకు సంక్షేమ పథకాలను అందించి ఎందరో ప్రాణాలను కాపాడిన సేవా దృక్పదం కలిగిన వలంటీర్లను అలా మాట్లాడినందుకు పవన్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పవన్ కళ్యాణ్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ ఎదురుపాక వెంకట్, పాపిరెడ్డి, తురకపాలెం, వెంగళాయపాలెం గ్రామాల వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కుల, మత, పార్టీలకతీతంగా నగరాభివృద్ధి: మేయర్



పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ కావటి, పశ్చిమ ఎమ్మెల్యే గిరి

నెహ్రూనగర్: కుల, మత, పార్టీలకతీతంగా గుంటూరు నగరాభివృద్ధి చేస్తున్నట్లు నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు, పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ పేర్కొన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 18వ డివిజన్ శ్రీనివాసరావుపేట, రామనామక్షేత్రం, అడపా బజార్లలో రూ.90 లక్షలతో సోమవారం సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనుల్ని ప్రాధాన్యతా క్రమంలో వేగవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. నగరంలో ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా ప్రధాన రహదారుల విస్తరణ చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని పేద ప్రజలకు సీఎం వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాల్ని అమలు చేస్తున్నారన్నారు. దీంతో నగరాభివృద్ధికి పూర్తి సహాయ, సహకారాలు అందిస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గుంటూరు నగరాభివృద్ధికి పార్టీలకతీతంగా కట్టుబడి ఉన్నామని తెలిపారు. ప్రస్తుతం గుంటూరు నగరంతో పాటు నగరపాలక సంస్థ విలీన గ్రామాల్లో అభివృద్ధి పనులు పెద్దఎత్తున జరుగుతున్నాయని పేర్కొన్నారు. రామనామ క్షేత్రం ప్రధాన రహదారి నాలుగు రోడ్లుగా విస్తరించి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. శ్రీనివాసరావుపేట శ్మశాన వాటికను రూ.5 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కాంట్రాక్టర్లు కూడా టెండర్ నిబంధనల ప్రకారం నిర్దేశిత సమయానికి పనులు పూర్తి చేయాలని, అధికారులు కూడా వాటిని పర్యవేక్షిస్తూ ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నిమ్మల వెంకటరమణ, గేదెల నాగరంగమణి, కాండ్రుకుంట గురవయ్య, నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయాల కార్యదర్శులు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

బొమ్మిడాల భానుమూర్తి జన్మదిన వేడుకలు

పాత గుంటూరు: బొమ్మిడాల గ్రూప్ చైర్మన్ బొమ్మిడాల భానుమూర్తి 92వ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. సంస్థ కార్యాలయంలో భానుమూర్తి జన్మదిన కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో ప్రతికనబర్చిన విద్యార్థులకు, మంచి మార్కులు సాధించి ఉన్నత చదువు చదవలేని విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు అందజేశారు. స్నేహ సమాఖ్య వృద్ధాశ్రమం , షిర్డీ సాయి దీనజన సేవాసమితి, బధిరుల పాఠశాలలకు డొనేషన్లు అందజేశారు. తమ సంస్థలో ఉత్తమ ఉద్యోగులకు అవార్డులు అందజేశారు.

టీటీడీ పాలకమండలి సభ్యుడు పూర్ణయ్యకు సత్కారం

గుంటూరు ఎడ్యుకేషన్: భారతీయ సనాతన సంస్కృతిలో దేవాలయం, గ్రంథాలయం, విద్యాలయం విడదీయరాని అనుబంధాన్ని కలిగి ఉన్నాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ పేర్కొన్నారు. అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థను సోమవారం సందర్శించిన తిరుక్కోవల్లూరు పూర్ణయ్యను సత్కరించారు. దేవానంద్ మాట్లాడుతూ ధార్మిక సంస్కృతి పరిరక్షణకు కృషి చేయాలని ఆయన్ను కోరారు. అన్ని సామాజిక వర్గాలు, మతాల్ని సమదృష్టితో చూస్తూ సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నారని పేర్కొన్నారు.

దస్తావేజులు పోయినవి

నెముకిచంటి సుశీలరావు తండ్రి ప్రసాదరావు చేబ్రోలు మండలం, శేకూరుపాలెం గ్రామ వాస్తవ్యులకు చెందిన శేకూరుపాలెంలోని 190 సర్వే నెంబరులో గల ఎ.0.2 1/2 సెంట్లు నివేశన స్థలంకు సంబంధించిన డాక్యుమెంటు నెం 111/1988గా గల ఒరిజినల్ డాక్యుమెంట్లు తీసుకుని జిరాక్స్ కోసం 10.05.2023న బైక్ పై చేబ్రోలు వెళ్తుండగా మార్గమధ్యలో పోయినది.
దొరికిన వారు సంప్రదించు: 8341215610

వంగవీటి రంగా వ్యక్తిత్వం స్ఫూర్తిదాయకం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తులసి ధర్మచరణ్, తుర్లపాటి సురేష్ తదితరులు

కొరిటిపాడు: దివంగత నేత వంగవీటి మోహన రంగా వ్యక్తిత్వం స్ఫూర్తిదాయకమని వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ అన్నారు. పేద, బడుగు, బలహీనవర్గాలకు ఆయన చేసిన సేవల్ని ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మర్చిపోరని, ప్రజల మనసుల్లో ఆయన ఎల్లప్పుడూ జీవించే ఉన్నారని తెలిపారు. వంగవీటి రాధా, రంగా జీవితాలలో జరిగిన పలు యథార్థ సంఘటనల గురించి ఆయన అనుచరుడు తుర్లపాటి సురేష్ రాసిన ×వంగవీటి చైతన్యరథ సారథులు¥ అనే పుస్తకాన్ని వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్, తెలగ అభ్యుదయ సంఘ సభ్యులతో కలసి వేద సీడ్స్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధర్మచరణ్ మాట్లాడుతూ చరిత్రలో చిరస్మరణీయుడు వంగవీటి రంగా అని, ఆయన జీవితం మొత్తం పేద ప్రజల అభ్యున్నతికే కొనసాగించి అసువులు బాశారని తెలిపారు. పుస్తకాన్ని రాసిన తుర్లపాటి సురేష్, ప్రచురించిన తన్నీరు శివశంకర్‌ను అభినందించి దుశ్శాలువాతో సత్కరించారు. విజయ్ కుమార్, శ్రీకాంత్, దేగల వెంకటేశ్వరరావు, రంగారావు, గుడి సతీషకుమార్, ఏపూరి అనిల్, తన్నీరు శ్రీనివాసరావు, రవికుమార్ పాల్గొన్నారు.

ఫిర్యాదులను విభాగాధిపతులే పరిష్కరించాలి

నెహ్రూనగర్: నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు అదనపు కమిషనర్ పెద్ది రోజా సోమవారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో స్పందన నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల నుంచి అందే ఫిర్యాదుల పరిష్కారంపై బాధ్యతతో వ్యవహరించాలని అధికారులకు తెలిపారు. జగనన్నకు చెబుదాంకు అందే అర్జీల పరిష్కారానికి విభాగాధిపతే బాధ్యత తీసుకోవాలని చెప్పారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలని సూచించారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 37 ఫిర్యాదులు అందాయన్నారు. వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 15, ఇంజినీరింగ్ విభాగానికి 11, ప్రజారోగ్య విభాగానికి ఒకటి, రెవెన్యూ విభాగానికి నాలుగు, ఉపా సెల్ విభాగానికి మూడు, పరిపాలన విభాగానికి రెండు, అకౌంట్స్ విభాగానికి ఒకటి చొప్పున ఉన్నాయని వివరించారు. ఫిర్యాదుల్ని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకటకృష్ణయ్య, రవీంద్ర, ఎస్ఈ భాస్కర్, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్‌వో డాక్టర్ భాను ప్రకాష్, మేనేజర్ శివన్నారాయణ, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, డెప్యూటీ సిటీప్లానర్లు, ఏసీపీలు, ఈఈలు, ఎస్ఎస్‌లు పాల్గొన్నారు.